# ఎందుకు ?

ఆమె ఒక జమీందారిణి. గారాబపు పెంపకం. ఆ సాయంత్రపుటెండలో కలిసి మెరుస్తున్న వొంటిఛాయ. వొంటినిండా నగలు, బంగారు గజ్జెలూ, కడియాలూ, ఆలోచించుకోండి భారీమనిషి. గొప్ప అందం, ఆమె నడకతీరు, దేహం ఠీవీ, కళ్ళల్లో గర్వం - గుంపులో చూసినా ఆమె ప్రత్యేకం. అరికాలుకిందైనా మరకనెరగని ఆమె పట్టుదిళ్ళ నానుకుని కూచుంటే, అట్లా నుంచుని అదేపనిగా చూడాలనిపించేది, ఆడదాన్నైనా, నాకు కూడా. ఆమెని కావిలించుకుని, లోబరుచుకుని, అనుభవించగల పురుషుడనేవాడు కనపడతాడా అనిపించేది. ఆమె స్వభావంలో కూడా ఆ అందానికి సరిపోయిన వివేకం, యోచన, స్తిమితం అన్నీ వుండేవి. ఇవన్నీ ఎందుకింత వివరంగా చెపుతున్నానంటే, ఆమె జాతకం ఎట్లా నడిచిందో చూడమని. ఏవో గ్రహాలు పనిచెయ్యాలి గాని, మానవదృష్టికి, ఆమెకి విధి ఇచ్చిన వరాలకీ, ఆమె జీవితాన్ని నడిపిన మార్గానికీ ఏమీ సంబంధం లేదు'' అని ఆగింది. మమ్మల్ని ఆ సాయింత్రం చూడ్డానికి వొచ్చిన శాంతాదేవి.

బృహస్పతి నడినెత్తిన పొడిచాడు. విదియనాటి చంద్రవంక పసుపు మబ్బు సందుల్లోంచి జన్మ నిచ్చుకుంది. లీల కళ్ళు మూసుకుని లోపలికి వెళ్ళారు భగవాన్ పటంవంక చూడ్డానికి.

"మనుష్య స్వభావం పూర్తిగా తెలిస్తే, జీవితం నడక ఎట్లా వుంటుందో చెప్పగల మంటారు డిటర్మినిస్టులు అనేవాళ్ళు'' అన్నాను.

ఆమె, లీలతో వెళ్ళిన తలుపువంక చూస్తో కూచుంది, భక్తితో సగం బరువైన కళ్ళతో. పెదవుల వెనక చిరునవ్వుతో నొచ్చి కూచున్నారు లీల.

"పెళ్ళి కావడమూ, భర్త రోగిష్ఠి ఐ చచ్చిపోవడమూ - తన ఆస్తిని కూడా ఆమెకి వొదిలి - నాలుగేళ్ళలో జరిగాయి. అటు తరువాత చూశాను మళ్ళీ ఆమెని!''

"ఆమె భర్తని చూశారా మీరు?'' అన్నాను.

లీల కంటి కొలికిలోంచి నన్ను చూస్తో, నవ్వును కొంచెం పైకి కనబరిచారు.

"లేదు. కాని ఆమె అట్లానే కూచుని వున్నారు. అరేళ్ళనించి నేను వొదిలి వెళ్ళినచోటే అట్లానే కూచుని వుందేమోననిపించింది. ఒక్కరవ్వ మార్పులేదు. ఆమెభర్త ఆమె జీవితంలో ప్రవేశించినా, నిర్గమించినా, ఆయన ఏ చిహ్నాల్నీ ఆమెలో ఎక్కడా మనసులో గానీ, వొంటో గానీ వొదిలి వెళ్ళినట్టు కనిపించలేదు నా కళ్ళకి. మూడురోజులున్నాను. ఇంటినిండా కావలసిన వాళ్ళు. పనివాళ్ళు మామూలుగా ఐశ్వర్యవంతుల నల్లుకు వుండేవారంతా, వంటలు, చాకిరీలు, వ్యవహారాలు. కాని ఆమె విరామంగా, శాంతంగా ఆ దిళ్ళమధ్య

వెలుగుతో, భూమి తిరుగుతుంది. యుద్ధాలు జరుగుతాయి. భర్తలు వొస్తారు, పోతారు. కాని ఆమె సౌందర్యం, శాంతి అట్లానే స్థిరంగా ఆ పక్క మీద నిలిచిపోతాయనిపించింది. ఒక్క సంగీతమే ఆమెని కదిలించగలదు. అందువల్లనే నా మైత్రి మీద ఆమె కాపట్టు'' అని ఆగింది ఆమె.

"ఎందుకీ యుగంలో పుట్టానా - సౌందర్యవంతులూ, ప్రణయార్ద్ర..." అని నెమ్మదిగా కోట్ చేస్తున్నారు లీల, నావంక కొంటెగా చూస్తో.

"ఏమిటంటారు?'' అన్నారు ఆ వొచ్చిన ఆమె.

"ఏమిలేదు. నా 'శశాంక'లోంచి వచ్చిచెపుతున్నారు'' అన్నాను ఆమెతో.

"తారని ముందు పెట్టుకునే అన్నాడు ఆ మాటలు శశి. అది మరిచిపోకండి'' అన్నాను లీలతో.

చెప్పే కుతూహలం మా అతిథికి ఆగటంలేదు.

"తరవాత యాడాదికి పిడుగు వంటి వార్త విన్నాము. ఆమెకీ ఆమె కమతగాడికీ, ముతకవాడు, చదువు, అందం ఏమీలేని వుత్త...''

"చాలా సహజం'' అన్నాను.

"ఏం?'' అన్నారు లీల ధిక్కారంగా.

"దేహం'' అన్నాను.

"సరేలే నీ థియరీలు?'' అన్నట్టు లీల తల వూయించారు. ముంగురులు చంపమీద కదులుతో, పడమటి చివరి ఎర్రజీర ఆమె కొలుకుల్లో ప్రతిఫలిస్తోంది.

"వినండి పూర్తిగా - మీ కథల పద్ధతిగా మంచిబలం, శక్తీ, శుభ్రం, అనాగరికం - స్త్రీ ఇష్టపడే యీ గట్టి లక్షణాల కింద జమకట్టినట్టున్నారు. కాని అతను తాగుబోతు, జూదగాడు, వంచకుడు - అతన్ని చూశాను వాళ్ళయింటో నేను. డబ్బు వ్యవహారానికై వొచ్చేవాడు. మనిషి శరీరం కాదు. అసలు లోపల్నించి అతన్ని భరించలేము'' అన్నారు శాంత. లీల నవ్వారు, పెదవులు విచ్చి -

"ఎబ్బే, ఆ దుర్గుణాలలో ఏ వొక్కటి వున్నా ఆ భర్తని వొదిలేసి తీరాలంటారుగాని, ప్రియుడిలో అవన్నీ చాలా వాంఛనీయమైన లక్షణాలు చలంగారికి'' అన్నారు వెక్కిరింపుగా.

ఆ వొచ్చిన ఆమె నమ్మలేక నా వొంక చూశారు. లీల వెక్కిరింపు చూపుల కిందా, ఆమె ఆశ్చర్యపు అనంగీకారం కిందా ఇబ్బందిపడే నన్ను చూసిగావును, ఒకరివొంక చూసుకుని నవ్విన నవ్వుల కలయికల శ్రావ్యానికి గాలి పులకరించింది.

"తరువాత....'' అన్నాను నేను.

"నేను నమ్మలేదు. ఆ పట్టుదిళ్ళ మధ్య. ఆమె చేతుల్లో ఏ దేవేంద్రుణ్ణయినా పట్టం కట్టుకోలేని నాకు, ఆ మోటు మనిషిని... ఏమీ నమ్మలేక పోయినాను. నమ్మను పొమ్మన్నాను కాని."

"అవును కొన్ని జరుగుతాయి" అయినా మనసు చూపుకు సరిపడవు. ఆలోచించుకోడానికి అందవు" అన్నారు లీల.

"కాని అంతా నిజం."

"ఎంత ధర్మాత్ములు వీల్లేదన్నా, వొప్పుకోకపోయినా, కళ్ళు మూసుకున్నా, ఇట్లాంటివి జరక్కమానవు. ఏం చేస్తాం?" అన్నాను. ప్రజలమీది నా మామూలు వెక్కిరింపుతో.

"వెళ్ళి చూశారా?" అన్నారు లీల.

"లేదు. భరించలేననిపించింది" అని, ఏదో ఆలోచించుకుంటో ఆగారు ఆమె. చివరి పడమటి ఎర్రకాంతి ఆమె పసుపు చీరకి కాషాయపు రంగునిచ్చింది. చీకటి దయతో ఆమె వాడిలిపోయిన చంపల్నీ, కాంతిపోయిన కళ్ళనీ, అశ్రద్ధ చేసిన వొంటినీ దాచేస్తోంది.

కొంచెంసేపు ఆ సంధ్యా శాంతంలో నిశ్శబ్దంగా కూచున్నాము. మా ఆలోచనలలో మునిగి, దూరంగా రొదచేసే మిలటరీ రైలు నాకు మెళుకువనిచ్చింది. నా లోపలి ఊహల పరంపరకి శబ్దాన్నిచ్చాను నేను.

"మొదట అతనికెట్లా వీలయిందో, ఏ సమయంలో జరిగిందో, ఆమె ఎట్లా అతనికా చొరవనిచ్చిందో తన అభిమానాన్ని ఎట్లా తోసేసుకుందో, ఆ గొప్ప అదృష్టానికి అతనేమైనాడో, ఓసారి ఏ ఛాన్సువల్లనో జరిగినా, ఆమెదాన్ని ఎట్లా అంగీకరించి కన్టిన్యూ కానిచ్చిందో, ఊహకి, కథకుడి కల్పనకి కూడా అందడం కష్టం. చాలా విపరీతమైన సంఘటన" అన్నాను.

"ఎబ్బే! అతనికి ఆ గొప్ప దూరంగా నన్నా గుర్తు తెలుస్తుందంటారా? చేతికి చిక్కిన స్త్రీ ఎంత తక్కువవాడికీ ఎంత చులకనౌతుందనుకున్నారు?" అన్నారు లీల.

"నిజం" అంది ఆమె చీకట్లో ఎక్కణ్ణించో.

"అతనా? ఆమా? ఎవరు ఉద్యమించారు? అవసరమైతే ఆమెకెవరూ దొరకరా? అతనైతే అతనికి అంత సాహసం ఎట్లా వొచ్చింది? ఇదంతా ఛాన్సా? లేక అట్లాంటి నీచుడైతేనే గాని తృప్తిపడని అగాధాలు ఆమె స్వభావంలోనే దాక్కుని వున్నాయా?" అని బిగ్గరగా ఆలోచించాను నేను.

"ఎప్పటికీ ఎవరికీ తెలీని సంగతులవి" అన్నారు ఆమె.

"కాని తమకి తెలీదని తమలోనన్నా వొప్పుకుంటారనుకున్నారా మనుషులు?" అన్నారు లీల పడమట పొడుస్తున్న గురువు వంక చూస్తో.

"అవును, ప్రతినోటా అదే. అనేకమైన కారణాలు చెప్పుకున్నారు."

"అవును, ఈ మోటు ప్రియుడికి స్పష్టమైన మొగవాడికి వుండవలసిన గట్టి దుర్గుణాలన్నీ వున్నాయి. ఏదో ఆమెకి కావలసిందేదో ఇస్తాడు కాని, కావ్యాలూ చదవడు. తన ధనం డాబులూ కొయ్యడు. తన మర్యాద ఏమైపోతోందోననే వెనకచూపూ వుండదు, మనం చదివిన లేడీ ఛాటెర్లీస్ లవర్‌లో జ్ఞాపకముందా?" అన్నాను లీలతో.

ఆమె చేసిన పనిని నేను అంగీకరించను. క్షుద్రుణ్ణి చూసుకుంది. కాని ఆ క్షుద్రుడు కాని వాళ్ళని ఓసారి చుట్టూ తలుచుకుంటే, భర్తకాని మనిషిని ఏరుకునే అవస్థ పడితే, అంతకన్న గత్యంతరం కనపడదు - యీ పెద్ద మనుషుల సంగతులు విన్నకొద్దీ..."

"అవును, దేనికి పురుషుణ్ణి స్త్రీ కోరిందో, ఆ అవరసరం మీద అతనికి దీక్షో, గుర్తో, కాక వేరే గట్టి విలువలు లేకపోవడం కావాలనుకుంటాను స్త్రీకి. వీళ్ల ఉద్యోగాలూ, ధనాలూ, మర్యాదలవలె, అతని తాగుడూ, జూదం, అతని శృంగారానికో, కామానికో, దేనికైనా అడ్డురావు, అదిగాక అతను ఎక్కడ ఆగాలో అక్కడ ఆగుతాడు. ఇంక ఆ గంటనేకాక, స్త్రీ జీవితాన్ని ఆక్రమించుకుని సఫకేట్ చెయ్యడు" అన్నాను ఆలోచిస్తో.

"మీరూ నేనూ ఎన్ని కారణాల్ని ఇక్కడ కూచుని ఊహించినా, జాతికీ జాతికీ కలవవలసిందేగానీ, సంస్కారంలో ఇంత భేదం చాలాకాలం ఆ సంబంధాన్ని నిలవనీదు" అన్నారు లీల.

ఆ రూల్‌కి ఎదురు తిరిగి కలిసి బతికే నా స్నేహితుల్ని చూస్తున్నాను. ఆ చీకట్లో నేను, మా మిత్రురాలు ఆతృతపడుతున్నారు.

"చాలా కొద్దిరోజుల్లో , ఆమె ఆ మనిషివెంట వెళ్ళిపోయింది. అన్నీ వొదిలి, బంధువుల్ని, ధనాన్ని, సుఖాన్ని, మర్యాదని - అన్నిటినీ వదిలి, వేలునున్న వుంగరంతో సహా ఇంటో పెట్టి, కట్టుకున్న బట్టతో" అన్నారు ఆమె.

ఏదో జీవితము లోతులు వినబడ్డాయి అమె కంఠంలో, మరి ఆమె చెప్పే విధంలో వుందో, ఆ సాయంత్రపు నిబిడత్వంలో వుందో ప్రతిదినమూ వినే యీ స్త్రీ మూర్ఖసాహస చరిత్ర, ప్రతి అధ్యాయమూ ఎంతో బరువుగా ప్రత్యేకంతో మమ్మల్ని కదిలించింది. మా తలలకి చాలా దగ్గిరిగా, ఆకాశం మధ్య వెలిగే సింహంలోని బృహస్పతి ఆలకిస్తున్నా డనిపించింది.

"ఎందుకు?"

"వినే మీ కెంత తెలుసునో నాకంతే తెలుసు."

"ఆమె పరిస్థితులు, పరిసరాలూ మీకు తెలుసును గనక అడిగాను."

"ఏదైనా కారణం ఐ వుండవొచ్చు, కాకపోవచ్చు. బంధువులకి అభ్యంతరమే. కాని తెంపుకుని బైటపడుతుందంటే, ఏ నీచత్వాన్నైనా కడుపులో పెట్టుకుని భరిద్దురు వాళ్ళైనా."

"కాని అతనికేమన్నా ప్రాణభయం కలిగించారో!"

"వెళ్ళిపోతానని ముందే బెదిరిస్తే" ఏ జాగ్రత్తలో తీసుకుంటారని భయమో?"

"ఇట్లాంటి విషయాల్లో ఏ బంధువుల్నీ నమ్మకూడదు. ముఖ్యం అన్నదమ్ముల్నీ, తల్లిదండ్రుల్నీ, ఆపద గడవడానికి ఆ నిమిషానికి అన్నీ వొప్పుకుంటారు. కాని క్రమంగా ఊపిరాడకుండా బిగిస్తారు" అన్నాను.

ఒక్కసారి ఏ ధైర్యంవల్లనో రెక్కలు జాచి, ఆ పాపానికి ఆజన్మాంత బంధికానా ననుభవించిన దిక్కుమాలిన పక్షుల్ని తలుచుకుని.

"ఏమీ కారణం లేకుండానే, వూరికే స్వేచ్ఛగా గాలి పీల్చుకోడానికి, 'మనం మనుషులం ప్రియులం' అని బిగ్గరగా అనుకునే వీలుకై వెళ్ళిపోయి వుండవొచ్చు" అన్నారు లీల.

"స్వేచ్ఛ మనసుల్లో వుండాలిగాని, మనుషులు మందిరాల్లో వుంటేనేం, ఎడారుల్లో వుంటేనేం?" అని అడిగాను.

"సరే నీ ఇష్టం అని చుట్టూ వున్నవాళ్ళు వొదిలినప్పుడు కూడా, అన్ని నిముషాలా వాళ్ళ కళ్ళు కాకపోయినా, వాళ్ళ మనసులు తన మీదే నిలిచి వున్నాయనీ, వాళ్ళు బాధపడుతున్నారని, తెలిసి సుఖపడడం - ఇంకా గతిలేనివాళ్ళకీ, చాలా మందమతులకీ తప్ప తక్కిన వాళ్ళకి సాధ్యంకాదు" అన్నారు లీల.

"వెళ్ళిపోయినారంటే ఆమె, చాలా గోల బైలుదేరి వుంటుంది" అన్నాను. ఆ వూళ్ళో నేను చూసిన పార్కు ప్రబంధకారుల్ని తలుచుకుంటో, వాళ్ళ కళ్ళ మెరుపులు, సానుభూతికింది ద్వేషం, ధర్మ విమర్శ కింది యీర్ష్య, వెకిలి నవ్వులు ఆ మాటలాగినప్పుడు రెస్ట్‌లెస్‌నెస్, మళ్ళీ ఆ సంగతినే పట్టలేక చప్పళించడం, కొత్తవారు రాగానే ఒకరికన్న ఒకరు తొందరగా, 'విన్నారా?" అని ప్రారంభించడం, మూలగడం అన్నీ.

"స్త్రీ తన స్థానాన్నించి కదిలిందంటే, స్వర్గానికన్నా వెడుతుంది, నరకానికన్నా వెడుతుంది" అన్నారు లీల.

"ఓసారి అనుభవమున్న మిత్రుడు ఒకాయన, వృద్ధు, "ఎన్ని ఘోరాలన్నా చెయ్యి, ఎన్ని నియమాలన్నా భేదించు, కాని కులంలోని స్థానాన్ని వొదులుకోవడం, దేనికీ చెందనివాడివి కావడం, శుద్ధ అవివేకం అన్నారు" అన్నాను.

"మీరేమన్నారు?" అన్నారు లీల.

"నాకు ఘోరాలు చెయ్యాలనీ లేదు. నియమాల్ని భేదించాలనీ లేదు. నా కుల స్థానాన్ని వొదిలించుకునేందుకే, మళ్ళీ యీ మనుషుల మర్యాదలు నన్ను అల్లుకొని ఊపిరి ఆపకుండానే, యీ ముళ్ళ కంచలన్నీ నాకు" అన్నాను.

"మీ మాటలు మీకే నిజంకాదు" అన్నారు ఆమె.

"వివేకవంతులు, తమ సుఖంపైన దూరదృష్టి కల మనుషులు ఎన్నడూ తమ స్థానాన్ని వొదులుకోకూడదు. ఇంట్లో, కులంలో, ఉద్యోగంలో, తన మిత్రుల్లో భార్యాపిల్లల్లో కూడా'' అన్నారు లీల.

"తమ సుఖమే, ప్రధానంగా చూసుకోని మనుషులున్నారు మరి!'' అన్నారు.

"ఉన్నారు, ఎందుకూగాని దరిద్రులు'' అన్నారు ఆమె.

"తమ సుఖాన్ని మంటబెట్టి, ప్రపంచానికి వెలుగునిచ్చిన మహాత్ములు'' అన్నాను నేను.

"వాళ్ళూ కటిక దరిద్రులే'' అని ధిక్కరించారు లీల.

"ఆ దరిద్రులు ఈ లోక సుఖాలకీ చెడ్డారని వొప్పుకుంటాను. వాళ్ళు ఇచ్చిన విలువలే గాక, యీ శరీర సుఖాల్ని మించిన జ్ఞాన సుఖాన్ని ఏం పొందారో మరి!''

"ఈ జంట ఆ జ్ఞానార్జనకే ఇల్లు వొదలి రోడ్డు పట్టారంటారా?''

"అదే యోచన, ఆమె ప్రోత్సాహమా? అతని ప్రోత్సాహమా? అతనెందుకు ప్రోత్సహిస్తాడు? కూలి అతనికి, గొప్ప శయ్యాసుఖం, ధనం, ప్రాముఖ్యత! అతనెందుకు కదులుతాడు?''

"అట్లా అనకండి. ఏ మాత్రం అభిమానం వున్న పురుషుడు స్త్రీనించి తనకి వొచ్చే, ధన భాగ్యాల్ని సహించలేడు.''

"ఇట్లాంటి మోటుమనిషి కూడానా?''

"మీరే వ్రాస్తారు. మళ్ళీ మీరే ఇట్లా మాట్లాడతారు. అభిమానమంతా యీ చదువుకున్న నాగరికులదే ఐనట్టు.''

మిత్రుడు రామానుజం మాటలు జ్ఞాపకమొచ్చాయి.

"మీ తెలుగువాళ్ళు విచిత్రమైన మనుషులు, చెయ్యిచూసి జోస్యం ఏమడుగుతారో తెలుసునా తమకి ధనంతో కూడిన స్త్రీ వొస్తుందా అని. వొచ్చినప్పుడు ఎక్కడో ఎవరికో వొస్తుందేమో కాని సుఖంగా కాపురంలో ఉన్న మొగాడు, పరాయి స్త్రీ తనకి రావాలని కోరడం, విచిత్రం, అడగడానికి ఏమన్నా సంకోచం సిగ్గూ కనపరచరు. అదేదో చాలా గర్వపడవలసిన విషయంలాగు, అంతేకాదు. ధనంతో రావాలిట. తనకి ఉద్యోగమౌతుందా, ధనం సంపాయిస్తారా, పోనీ లాటరీ వొస్తుందా అని కూడా అడగరు. స్త్రీ తెచ్చిన ధనంతో బతకడం యీ పురుషుడి ఆశయం, అదీ యీయన కల! అంతకన్న నీచం, హీనం నాకు కనపడదు. మా దేశంలో ఎవరికన్నా ఆ జోస్యం చెపితే, అట్లాంటి గతి పడుతుందా అని తల వొంచుకుంటారు'' అన్నాడు.

ఎందుకా అని యోచిస్తే, తెలుగు యువకుల్లో నీచత్వం కాదు. బద్ధకమేమో, సౌందర్యం కావాలి. పోనీ రొమాన్స్ కావాలి. దానికి అవసరమైన క్వాలిఫికేషన్ కోసం ప్రయత్నించలేడు. వెతకడం బద్ధకం. డబ్బు సంపాయించే ప్రయత్నం బద్ధకం. దాన్నే జాతకం తెస్తే, తిండికీ శ్రమ లేదు. రొమాన్సుకీ శ్రమలేదు. దిక్కుమాలిన స్త్రీ ధనం ఖర్చై, భారమైతే వొదుల్చుకోడం చాలా సులభం. నిజం, అభిమానమున్న పురుషుడు ఆ స్తితిని ఎన్నడూ అంగీకరించడు.

"ఆమె కదిలించిందేమో అతన్ని?"

"తగిన కారణం వుండంది స్త్రీ కదలదు ఇంటినించి. లోకానికా కారణం తెలీకపోవచ్చు" అన్నారు లీల.

"అందులో తాగుబోతుని, జూదగాణ్ణి నమ్మి, తన జీవితాన్నతని చేతులోకిచ్చి" అని ఆగాను.

"నీతుల్ని, ధర్మాల్ని వొదిలి మాట్లాడినా, ఎక్కడో ఏ మందిరాల్లోనో, అంత:పురాల్లోనో అపురూపంగా వెలగవలసిన అందాన్ని, ఇట్లా చవక చేసుకోవడం, వీధులవెంట ఈడవడం అపరాధమనిపిస్తుంది."

"నీచుడైన భర్తకందివ్వడమో?" అన్నాను.

"అతనిలోనే నీచపడుతుంది. వీధుల్లో నక్కలపాలు కాదు" అన్నారు లీల.

"ఈమె కాలేదు" అన్నారు రోషంగా తన మిత్రురాల్ని గురించి శాంతాదేవి.

"వారి సంగతి కాదు" అని నావేపు తిరిగి "మీరెంత వాదించండి. భర్త చేతుల్లో నీచపడడానికి, ప్రియుడి చేతుల్లో నీచపడడానికీ లక్ష భేదముంది. ప్రేమలో లోకానికి లోకువ కావడం. సమర్థుడైన పురుషుడు తనకి ఓ గూటినిచ్చి చూసుకోకపోతే, స్త్రీ జీవితం కుక్కల పాలు."

"భర్త, భార్యను అత్తమామలకి లోకువ చేస్తే అక్కడ కనపడదా ఈ వికృతం?"

"వికృతమే? కాని అది వేరు. ఎంతైనా."

"When married people don't get on they can separate; but if they are not married it is impossible" అన్న లేడీ కిట్టీరోదన నాకు జ్ఞాపకం వొచ్చింది.

"కాని ఏం వేరు? వివాహానికి ఇంత ప్రాముఖ్యత ఇవ్వడంలో వొచ్చిన భేదం ఇది. ఆ వివాహాన్ని దిక్కరించి వెళ్ళడంలో నాకు శౌర్యం కనపడుతుంది. మూర్ఖం కాదు. సీత రాముడితో వెళ్ళడం పాతివ్రత్యమైతే ఈమె ఈ మోటు మనిషితో వెళ్ళడం అంతకన్న ఎంత గొప్పో అనిపిస్తుంది నాకు" అన్నాను.

You dont know what it is to have a man tied to you by his honour అంటుంది లేడి కిట్టీ.

నిజం. కాని యీ వివాహమే అన్ని అనర్థాలకీ మూలం.

"కాని ఆమే అతన్ని తీసికెళ్ళిందేమో?" అన్నారు శాంతాదేవి చాలా జాలిగా.

"ఎందుకు తీసుకు వెళ్ళివుంటారు?" ఆలోచించండి. శృంగారానికో ప్రేమకో త్యాగమేనంటాను" అన్నాను.

"కామానికైతే..."

"మహా త్యాగమంటాను."

"తక్కినవి వొదిలి ఒక్క విలువమీదనే దృష్టిపెట్టి మాట్లాడకండి. కామం తీర్చుకోవడం కోసం, ఇల్లు వొదలి, కావలసిన బంధువుల బాధని నిర్లక్ష్యం చేసి, తన ధర్మాన్ని తృణీకరించే స్త్రీ! సంసారానికి త్యాగం చేస్తే అధర్మమున్నూ, కామానికి చేస్తే ధర్మమున్నూ, అయింది మీ దృష్టిలో."

"అట్లా కాదు. కామం తీర్చుకోడం స్త్రీ హక్కు. ఆ ఉద్యమంలో ఇవన్నీ త్యాగం చెయ్యవలసి రావడం మీ దుర్మార్గపు సంఘ నియమాలవల్ల" అన్నాను.

"మరి ఎట్లా బతికారు వాళ్ళు?" అని ఆమెనడిగారు లీల, నాతో వాదించి ప్రయోజనం లేదని.

"తెలీదు, అన్నీ వార్తలు, వాళ్ళెట్లా బతుకుతున్నారో తెలుసుకోడానికి అందరికీ ఎందుకంత శ్రద్ధ కలిగిందో, ప్రతివారి కంటికి వారు అక్కడక్కడ కనపడుతో వుండడం ఎట్లా తటస్థించేదో అర్థం కాదు. కాని మొదట్లో వారం వారం, తరువాత కొన్ని నెలలకోమాటు వాళ్ళనెక్కడో దూరాన్నుంచి చూశామనీ, వాళ్ళేననీ, వాళ్ళని పలకరించామనీ కూడా చెప్పుకునేవాళ్ళు. ఎప్పుడేం చెప్పుకున్నా, వాళ్ళ జీవితంమీద ఒక్క రాయి విసిరే సంగతేగాని ఒక్క మంచిమాట, పోనీ ఒక్క జాలిమాట వినపడదు.

క్రమంగా దరిద్రాన్నెక్కువ చేశారు. చివరికి ఆమె పేలికలు కట్టుకున్న వరకు, అతను బట్టలేకుండా తిరిగేవరకు. అతను తాగుతాడు. ఆమెని ప్రతిరోజూ తంతాడు. ఆమెని గుర్తించడమే కష్టం. ప్రతి వూళ్ళో చూశారు వాళ్ళని, గుడిశల్లో, కల్లు దుకాణాల్లో, పట్టణాల్లో మురుగు కాలవల పక్కన, మార్కెట్లలో పారేసినవి ఏరుకుంటో, ధర్మశాలల అరుగుమీద...

'ఎన్ని అబద్ధాలు కల్పిస్తారు మనుషులు. నమ్ముతారా లేదా అనన్నా యోచించరు. ఆవొక్క, ఆమర్యాదాకార్యం చేసిందా స్త్రీ, ఆమెకి అన్ని దురవస్థలూ దుర్మార్గాలూ ఆరోపిస్తారు. ఇంకా దొంగతనం, లంజరికం, ఖైదూ, కట్టలేదా ఆమెకి!' అన్నారు లీల.

'లేదు, అక్కడే వుంది ప్రజల ఇంతటి హీనత్వంలోనూ సత్యం.

"ఏం సత్యం? గొప్ప గొప్ప ప్రేమ కవిత్వాలు చదివాను. ఆ ప్రేమ కవుల్నీ ఒకరిద్దర్నీ, తక్కినవారి చరిత్రల్నీ, మాటల్నీ, ఎరుగుదును, విన్నాను. ఆ కవిత్వం చదివితే, ఆ కవుల

హృదయాల్లో ఎంత విశాలం, ఎన్ని లోతులు, ఎంత విచక్షణ, ప్రేమకి ఎంత గొప్ప విలవ, అని మూర్ఛలు పోతారు. నిజంగా లోకంలో ప్రేమ వాళ్ళ కళ్ళముందు పడ్డప్పుడు వాళ్ళు పలికేటంత నీచంగా సంకుచితంగా ఏ మానవుడూ మాట్లాడడు. ఏ నిర్భాగ్యురాలో వాళ్ళ పాలపడ్డదా, ప్రేమా, గౌరవం, అటుంచి మానవుల్లో క్షుద్రుడు కూడా తన పాలబడ్డ స్త్రీని అంతకన్న జాగ్రత్తగా మనసిచ్చి చూసుకుంటాడు. ఈ కవుల, కథకుల బొంకుకి, ఈర్ష్యలకి అంతులు నిర్ణయించడం కష్టం. తమకి దక్కని స్త్రీపైన, ప్రేమపైన వాళ్ళు చూపే క్రౌర్యం, నీచత్వం, మనుషుల్లోంచి ఎన్నడన్నా వినగలమా అనిపిస్తుంది. ఈ ప్రేమ పోకడలులేని మానవులు ఎంత ఉత్తములనుకున్నారు! వాళ్ళ ఆచారాలూ, మూర్ఖతలేగాని, ఇంత వికృతం రాక్షసం ఎవరిలోనూ వుండదు. అందుకనే గీతాల్లో, పాటల్లో, ప్రేమ అనే పదం వింటే వికారం లోపల్నించి" అన్నారు లీల.

రచకుల అందరి తరఫునా తల వొంచుకున్నాను.

'కాని, కొంత కల్పించడం మాత్రం క్షమించవొచ్చు అనేట్టు మాట్లాడారేం ఇందాక, అన్నాను శాంతాదేవితో.'

"వాళ్ళు చెప్పుకున్న ప్రతిమాట నిజం గనక."

"నిజమా!!!"

"తాగేవాడా? ఆమె సర్వమూ వొదిలి తనతో వొచ్చినా? తన్నేవాడా? ఆమెని? పాపం ఎంత అవమానం? సహించిందా?"

"ఏం చేస్తారు ఆమె? తిరిగి రావడానికి దిక్కులేని పరిస్థితి" అన్నాను.

"తిరిగి రావాలని ఆమె ఆలోచించందే? వీలున్నా వొచ్చేది కాదు ఆమె. అంతవరకు నిశ్చయం..." అన్నారు శాంతాదేవి. తెలిసినట్టు నిశ్చయంతో.

"అవమానం భరించలేకా?"

"అసలు ఆ అవసరం ఆమెకి తోచనేలేదు. ఆ బతుకు ఘోరమే. కాని ఇంకే బతుకు కన్నా అదే సుఖం" అన్నారు ఆమె.

"ఏమిటి అమెని కలసుకున్నారా మీరు?"

"ఊఁ", అని వూరుకున్నారు ఆమె.

మాటలకు మించిన ఆలోచనలో పడ్డాను.

"కొన్ని గొప్ప విషయాలున్నాయి. ఆమె తిరిగి రాలేదు. అతన్ని వదలలేదు. తన నెరిగిన మనుషులతోటి పశ్చాత్తాపాన్ని చూపలేదు. అతన్ని తిట్టలేదు. ఇతరులతో చచ్చిపోలేదు."

"విచిత్రం! ఆ పట్టు ఆమె ఔదార్యస్థైర్యాలలోంచా ! అతనిలోంచి ఆమెకి కలిగిందా? ప్రేమ, శృంగారం, ధర్మం, శాంతి. ఈ మాటల్లో ఏదీ దూరాన్నించైనా మాట్లాడనీరు. వారి విషయమై, వీలూలేదు. ఎక్కడ వుంది ఆ యిద్దరి మధ్యా వీడిపోని, తెగని, యీ బంధం? ఆ బంధంలో ఆ బలం? ఆమెలో 'ఇది చేశాను. నలుగురిముందూ నేను ఓడిపోకూడదు. హేళన కాకూడదు. నేనే సంగతికి దిగినాసరే!' అనే మూర్ఖపు పట్టుదలా! లేక అతనేం చేసినా, ఎటువంటివాడైనా, నా దైవం, అనే పురాణ పాతివ్రత్యమూ! లేక ఆ హీనత్వం, ఆ మురికి బతుకు ఆమెకి ఏ పెర్వర్షన్ వల్ల నన్నా ఇష్టమా? తానే దింపిందా ఆ స్తితికి! ఆ దెబ్బలు, తన్నేటట్టు చేసిందా? లేక ఒక్క నిమిషం అతన్ని తన చూపులోనించి వదలలేనంత..."

"లేదు, పొద్దస్తమానం ఆమెని వొదిలి ఎక్కడికో పోయేవాడు. ఆ రాత్రికి కావలసిన రెండణాలూ తెచ్చేందుకో జూదమాడేందుకో, దొంగతనానికో."

"మరి ఈమె..."

"ఈమె ఏ తూముకాలవలోకి చూస్తోనో, ఏ బిచ్చపు పిల్లల తగాదాలు గమనిస్తోనో, కార్లలోని ఐశ్వర్యవంతుల్ని చూస్తో ఏమాలోచించుకొంటోనే, శూన్యంలో మనసు నిలిపో, అట్లా కూచుని వుండేదిట. ఏ సాయంత్రమో తూగుతోవొచ్చి తగాదా ప్రారంభించి తన్నేవాడుట."

"ఏ అవస్తలోనైనా మొత్తానికి ఆమె దగ్గిరికి చేరకుండా వుండడన్నమాట ముఖ్యం."

"తన్నడానికైనా సరే" అన్నారు లీల.

"ప్రియుడికో భర్తకో తనని తన్నేటంత గుర్తు వుండడం గర్వమేకాక. లోపల్నించి ఓ గొప్ప సంతుష్టి స్త్రీకి అంటున్నారు మీరు, అవునా?" అని అడిగాను.

"అంతేకాదు. ఆ పురుషుడిచ్చే ఆదరం. తంతేనేం? వొదిలిపోతేనేం? తనమీది దృష్టి.. తనే కావాలనే పట్టు అతని మనసులో, తాను చేసిన త్యాగంమాట ఒకప్పుడన్నా అతని నోటినుంచి, ఏ తాగిన సమయాన ఐనాసరే. ఓ క్షణమైనా తనే కావాలి ప్రత్యేకంగా. తనే.... ఇంకెవరూ ఆ చోటునీ, ఆ లోటునీ తీర్చలేరనే సంగతి అతనితో - ఇదెంత కావాలనుకున్నారు స్త్రీకి! అట్లా అనకండి. యీ సంసారంలో లేనిదే అది. అందువల్లనే ఎన్ని సంపదులున్నా స్త్రీకి స్తిమితం లోపల్నించి లేకపోవడం, అది వొక్కటీ లేకపోవడం వల్ల."

కొంచెంసేపు మాట్లాడలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"తన్నులయిన తరువాత... ఇంక ఆ రాత్రి సంగతి. ఆ ఇద్దరి మధ్యా ఆ బలం, రాత్రి చర్యలో వుందా అని."

"అక్కడ! ఆ అరుగుమీద, బిచ్చగాళ్ళ మధ్య మురుగు కాలవ పక్కన - దుమ్ము పీలికలు-"

"నమ్మరు. కాని అక్కడ సరైన అనుభవం కుదిరిన అదృష్టమే పడితే - దేహాలెట్లా వున్నాయో, చుట్టూ ఎవరున్నారో - ఏమన్నా ఏకమౌతాయంటారా! మళ్ళీ ఆ అనుభవం తమదౌతుందనే నమ్మకం వుంటే, వొళ్ళు మరిచి అట్లా నిలబడరా మనుష్యులు, ఆ తృప్తి, ఆ జ్ఞాపకం, మళ్ళీ ఆ ఆవేశం, ఎత్తుమీద కూచుని, పశువులనీ, పందులనీ అంటారు. అది ఏమిటో తెలీని స్థితి పట్టడం వల్లనే. ఇంత స్తిమితంగా కూచుని, అర్థం కాక, తడుముకుంటో మాట్లాడడం మనుషులు" అన్నాను.

"ఎవరికీ ఏమీ అర్థంగాని గూఢరహస్యం, మహామంత్రం సంగతి మాట్లాడుతున్నారు మీరు."

"నిశ్చయం. అవును. తక్కిన విధాల మేలుకున్న మనిషికి యీ సుఖంలోని పట్టు తప్పుతోంది. మనసు, శరీరం నుండి విడివడడం తటస్తిస్తూంది. శరీరం మనసు వేరుగా కాని మృగాలలో కలిగే సుఖం మానవుడెన్నడూ ఎరగడు. మనోవిజృంభణే ఈ అనర్థానికి కారణం. కాని వికసించిన తన మనసునే మళ్ళీ శరీరంతో కలిపి అనుభవించే అదృష్టం - అది శరీరసుఖ ఆధిక్యతవల్ల కానీ, శృంగారాసక్తికానీ.... మళ్ళీ యీ విషయంలో పశువు కావడం నేర్చుకున్నాడా సంస్కారం పొందిన మానవుడు - ఇంక అతను సాధించవలసిన స్వర్గాలేముంటాయి! జంతువుల్లో సంపూర్ణమైన ఏకాగ్రత వుంది. మానవుడిలోనే అది కలగనీ! అతనికసాధ్యమయింది లేదు. సంస్కారం ఔన్నత్యం వున్నకొద్దీ, అతని శక్తీ మహిమా ఎక్కువౌతాయి సాధనవల్ల - వుత్త శరీరసుఖం మనసుని కట్టివేయగలిగిన రోజున - ఎందుకు తక్కిన సుఖాలన్నీ-"

ఈనాడు ఈ మనుషు లీ చచ్చు నీతుల్నీ, మర్యాదల్నీ మాట్లాడతారు గాని, పూర్వం అంగీకరించారు యీ రహస్యాల్ని. మీకో కథ చెపుతాను వినండి. వేదాంతానికి ప్రమాణ గ్రంథమైన యోగవాసిష్టంలోంచి ఇది.

మగధ దేశంలో ఇంద్రద్యుమ్నుడనే రాజు వుండేవాడు. భార్య అహల్య, ఆ వూళ్ళో ఓ తిరుగుబోతు వున్నాడు. ఇంద్రుడనే అతను. పూర్వపు అహల్య కథ జ్ఞాపకంతో అట్లాంటి అనుభవం కోసం యీ ఇంద్రుణ్ణి తానుగా పిలిపించి అతనితో సంబంధం పెట్టుకుంది రాణి. రాజుకి తెలిసింది. ఆయన కోపించి వాళ్ళిద్దరినీ చెరువులో పారేయించాడు. వాళ్ళు నవ్వుతున్నారు ఆ నీళ్లలో. కాగే నూనెలో వేయించాడు వాళ్ళని, దాంటోంచి వాళ్ళు "రాజా, ఇద్దరం కలిసి వున్నామనే ధ్యాసలో మేము వోలలాడుతున్నాము" అన్నారు. ఏనుగుల చేత తొక్కించాడు. ఇనప కడ్డీలతో, తోలు కొరడాలతో కొట్టించాడు. వాళ్ళకి బాధకలిగినట్టన్నా కనపళ్ళేదు. రాజు విసిగి, ఆశ్చర్యపడి, వాళ్ళనే ప్రశ్నించాడు. వాళ్ళన్నారు కదా!

"రాజా, ఏ శిక్షా, బాధా, మమ్మల్ని వేరు చెయ్యలేవు. లోకమంతా అహల్య రూపంతో, నా రూపంతో నిండింది. అన్నిట్లో మేము ఒకరికొకరం కనపడుతున్నాము. నేను ఆమె మొహంకేసి చూస్తాను. ఆమె నాకేసి చూస్తుంది. ఆ ఆనందంలో మా శరీరాలు మాకు తెలీవు. మనసు దేనిలోనన్నా లగ్నమైతే, ఆ శరీరంలో బాధ గోచరించదు. మనసు ఐక్యమయింతర్వాత యీ శరీరంతో పనుల అవసరమేముంది? దేనిమీద అమితమైన ఇష్టమో దాంటో సులభంగా నిలిచిపోతుంది మనసు. బాధ తెలిసేందుకు స్తలమెక్కడ వుంది? లోకంలో ఏదీ కూడా తాను ప్రేమించే వొస్తువు నించి మనసును కదల్చలేదు. ఈ శరీరాల్ని నశింపచేసినా, మనసులు తమకి ఇష్టమైన కొత్త శరీరాల్ని తీసుకుంటాయి" అన్నాడు.

ఇది విని రాజు సంతోషించాడు. సభలో వున్న భరతముని 'గొప్ప కామంలో వున్నా, వీళ్ళు గొప్ప జ్ఞాన వాక్యాల్ని మాట్లాడతారు" అన్నాడు.

రాజు వాళ్ళని తన దేశంలోంచి పొమ్మన్నాడు.

"ఈమెకేమీ మహిమలూ రాలేదు."

"ఇట్లాంటి కథలతో వొచ్చిన గొడవే అది, మీ కథలూ అంతే ఇట్లా అన్ని విశ్వాసాలూ, బాధ్యతలూ, తెంచుకుని బైటపడడమే. పాతివ్రత్యమూ, ఘనతా, ఆదర్శమూ అని రూఢి చెయ్యడానికి ప్రయత్నాలా? అనిపిస్తాయి. ఏ గోలా లేకండా కాపరం చెయ్యడం చాలా హీనమైనదీ, సిగ్గుపడవలసిన విషయమునూ అంటే, ఎక్కడ ఆదరణ కలుగుతుంది. మీ కలానికి ఎంత ప్రతిభవున్నా సరే?" అన్నారు లీల. చీకట్లోంచి ఆమె కళ్ళు ధగ ధగ మన్నాయి నామీద.

"ప్రపంచంలోని ఏ గొప్పతనాలకీ యీ చిక్కే వొస్తుంది. గంజాయి మత్తు జడుడికీ మహారుషికీ భేదం తెలుసుకోడం చాలా కష్టం. బైటి ధన భోగాలతో, రూపబలాలలతో మనుష్యుల్ని కొలవడం, విభాగించడం సులభం. కాని కార్యాలవల్ల లోపలి లోతుల్ని కొలవ పూనితే ఎప్పుడూ తప్పిపోతాము!" అన్నాను.

"ఈ ప్రేమ విషయమూ అంతేనా?"

"కాదా! నేను మొదటినించీ చెపుతున్నాను. ఈ విషయంలో, మనకి ఎంత వీలులేదని తోచినా, అతని దుర్వృత్తిని, మురికినే యిష్టపడే వికృత స్వభావం కావొచ్చు ఆమెలో. కాక నేను చెప్పిన కథలో రకం ఐక్యం కావొచ్చు. ఆ కథలోని ఇంద్రుడు ఏం మహా ఉత్తముడు? ప్రేమ అతన్ని ఇంకో మనిషిని చేసివుండవొచ్చు. లోపల మారి కూడా, పైకి ఇదివరకటి అలవాట్లతోనే తిరుగుతో వుండవొచ్చు. కాళిదాసును గురించి చెప్పుకునే కథలు జ్ఞాపకం తెచ్చుకోండి."

"కాని భేదం వుంటుంది... నీచత్వంలోంచి తప్పించుకోలేని స్తితికీ ఔన్నత్యంలో ఐక్యమై స్తిరంగా నిలిచిన స్తితికీ" అన్నారు లీల.

"ఒప్పుకుంటాను. అదొక్కటే కొలత కనబడుతుంది. నాకు నా అనుభవంలో - ప్రేమజీవితం కొంత గడిపింతరవాత ఆ ప్రియులలో, వాళ్ళ స్వభావాలలో కలిగిన మార్పునించి నిర్ణయించవొచ్చు. ఆ ప్రేమ విలవని" అని అడిగాను.

"మీరు ఆమెని చూశారుగా?" అన్నారు లీల ఆమెతో.

"కురుచేడి వారి వ్యవహారంలో నన్ను సాక్ష్యం తీసికెళ్ళారు. మద్రాసులో మధ్యాన్నం షాపింగు చేసుకుని టాక్సీ ఎక్కబోతూ ఉండగా తెలిసిన మొహం అనిపించి ఆగి చూశాను. ఈమె. ఆమె ఫీల్డ్ ఆఫ్ విజన్ లో వున్నాము మేము. కాని మావంక చూట్టంలేదు. పని లేకండా నుంచుని వుంది. ఆకారం వర్ణించనఖ్కర్లేదు. కాని ఇమ్మని చేయి జాస్తే, ఏమి వింత వుండదు. కంపూ, దుమ్మూ అని దూరంగా జరుగుతాము. నాతోవున్న వాళ్ళవంక చూస్తో, ఆమెని పలకరించ పోయినాను. వీపు తిప్పి కారెక్కబోతో వెనక్కి తిరిగి చూశాను. ఆమె నా వంక చూస్తోంది. పిలవబోతుందా అనిపించింది. ఏమీ ఆలోచన లేకుండానే వెళ్ళి ఆమె చెయ్యి పట్టుకున్నాను. ఆమె ఏమీ అనలేదు. ఇద్దరం అట్లా ఆగాము. ఏ మాటలకీ ఆ నిముషాలు అందని ఔన్నత్యాన్నో, సిగ్గులోతునో పొందాయి.

టాక్సీ అతను తొందర పెడుతున్నాడు. ఏం చెయ్యను? వుండిపోనా? ఆలోచించకండానే చెయ్యిపట్టుకు లాగి.

'రండి' అన్నాను.

ఆగి చూసింది. నాతో కదిలింది.

'మళ్ళీ ఇక్కడ దిగపెట్టాలి నన్ను" అంది రహస్యంగా.

ఆ కారు తనదైనట్టే సహజంగా కూచుంది.

"నాకు తోవలు తెలీవు" అంది.

నా మిత్రులు ఇరుక్కుని కూచున్నారు ఆమెకి తగలకండా, నవ్వలేదు. హేళనగా చూడలేదు. మనపుటక అట్లాంటి సమయాల్లోనే సహాయం చేసి నిలబెడుతుంది. మళ్ళీ ఒక్కమాటలేదు. ఇంటికి వెళ్ళాక చప్పున నా గదిలోకి తీసికెళ్ళి కూచోపెట్టాను. ఎవరివంకా చూడక. పక్కమీద కూచోమనడం బాధే. కాని దుప్పట్లూ, అవీ మార్చ వొచ్చును కదా అనే గొప్ప...

"ఎట్లా వున్నారు?" అన్నాను. నేనే మాత్రమూ దొంగగా నాకేమీ తెలీనట్టు ప్రవర్తించదలుచుకోలేదు ఆమెతో.

"తెలుసుగా మీకు?" అంది ఆమె.

"అవును సుఖంగా వుందా? వాడు.. ఆయన ఏం చేస్తున్నారు?"

"నాకు తెలీదు. నే అడగనాయన్ని.".

ఏమడుగుదామన్నా వుత్త తేలికగా కనిపించింది. ఆమె చేసినపని. ఆమె ప్రస్తుతస్థితి, ఏం మాట్లాడినా, ఆమెని గాయం చేస్తాననిపించింది. నేను గొప్పగా, ఆమె లోకువగా, అనిపించలేకండా నేను మాట్లాడలేననిపించింది. వూరుకున్నాను. ఆ రోడ్డుమీద వున్నట్టే, ఆ కుర్చీలోనూ కూచుంది. నేను, ఆమెకేమీ మనసుకి పట్టలేదు. ఇంతలో ఫలహారం టీ వొచ్చాయి మా ఇద్దరికీ, మాట్లాడకండా తింది. ఏమిటో ఆమె తరహా. యీ వ్యవహారాల కేమీ సంబంధించనట్టు కనిపించింది. తనవాళ్ళ సంగతి నా సంగతి ఏమీ అడగలే. ఘోరమైన విధి దెబ్బ కింద అణిగిపోయిన మనిషి మల్లే. పక్షవాతం వొచ్చినదానిమల్లే వుంది.

"ఎప్పుడన్నా తిరిగి ఇంటికి వెళ్ళాలనిపిస్తుందా?"

"ఇల్లా! నాకు ఇల్లెక్కడ?" అంది ఏమీచేదు లేకండా అని మళ్ళీ -

"అందరూ అక్కడ అట్లానే వున్నారా?" అంది, ఏమీ దానిమీద మనసు పట్టకుండానే.

"వుంటారు. ఏమవుతారు. అదేకాదు. మాలోకి రావాలని వుంటుందా?"

ఆలోచించింది తలవూయించింది. రానని దృఢంగా, నిశ్చయంగా.

"ఈ స్థితి బాధగా లేదా?" అన్నాను విధిలేక చాతనైనంత లోకువని కంఠంలోంచి తీసేస్తో.

"బాగానే వుంది."

ఆగి ఆలోచించాను. ఇంతేనా? ఎట్లా అంగీకరించను? నేను కూడా?

"అతనితో కూడా - ఐతే వొస్తారా?"

"అతను రాడు. నేనూ రాను."

"ఏం?"

"సరిపడదు."

తనలోపల చిన్నగా నవ్వుకుంది...

"మా పద్ధతి బతుకుకి. ఈ స్థితే చాలా వీలు"

ఆ మాటలు ఎట్లాగన్నా అర్థం చేసుకోవొచ్చు. కాని ఆమె ఉద్దేశించక పోయినా, ఆమె గొప్ప గర్వంతో, స్తిమితంతో అన్నదనిపించింది.

"క్రూరంగా చూస్తాడని విన్నాను. నిజమా?"

"క్రూరమా? అవును. అప్పుడప్పుడు క్రూరంగానే ఉంటాడు."

"ఎందుకు సహిస్తారు?" అన్నాను జాలిని వీలైనంతవరకు కనపరచకండా.

"అంతే. అతని రకం."

అని ఆగి ఆలోచించుకుంటున్నారామె. నేను ప్రశ్నించినవరకూ ఆమెకీ ప్రశ్నలు వచ్చినట్టు లేదు. నా ద్వారా లోకం కళ్ళనించి తనని చూసుకుని పరీక్షించుకుంటున్నట్టని పించింది.

"అదిగాక నాకు ఇష్టం."

"ఇష్టం!!!" ఆపుకోలేక పోయినాను కంఠంలో పెద్దధ్వని.

"నాలోమాత్రం ఎంత క్రూరత్వం. ~~ఈ~~ ప్రశ్నించడంలో మీలో ఎంత క్రూరత్వం."

తల వొంచుకున్నాను.

నా వొంక రెండు నిమిషాలు చూచి చిరునవ్వుతో...

"సిగ్గేంలేదు... అందరికీ వున్నాయి. చాలా చూశా లోకం. వున్నాయని మీ వంటి వాళ్ళు కలలో నన్నా వొప్పుకోలేని సంగతులు - చాలా అడుగున - మురికి కింద, పురుగుల్లో - లోపల్నించి దొంగగా కాకండా - ఎంత మర్యాద, ఎంత ధీరత్వం, నమ్మకం.... ఇంక నేను వెళ్ళాలి."

కారుకి కబురుపంపి, మెట్లు దిగుతున్నాము.

"క్రూరత్వం... ఎంత గొప్ప.... రక్తాలు కక్కుకునేట్టు స్త్రీని గుద్దడం చూశాను. మొగాళ్ళు మొహాలు కసితో కొరుక్కోవడాలు చూశాను. కాని, కాని... చాతగాని చచ్చుపీనిగల క్రూరత్వం ఒక్కటే నీచం, దుర్భరం... ఛీ... వెళ్ళి వొస్తాను."

నేనింకా సందేహంతో అట్లా నుంచున్నాను. ఏమీ అనక - ఆమె కూడా ఏదో ఆలోచించుకున్నట్టుంది.

"నాకోసం మీరు పడే దిగులు చూసి నాకు నవ్వుగా వుంది. మాటలతో చెప్పడం కష్టం. పురుషుడి నించి మీరెరిగిన ఆదరణ నగలూ, చీరెలూ, భార్యలూ- వండి, పడుకుని, కనే, మనుషులు... అంతే ఎట్లా చెప్పను? నువ్వు ప్రత్యేకంగా నువ్వు అనే గుర్తు. తన్నడానికైనా నువ్వే కావాలి. నిన్ను గుర్తించి, నిన్నే కోరి.. మాటలతో సాధ్యంకాదు ఆ అనుభవం.... నీ లోపల్నించి, నిన్ను తెలుసుకుని.... ఖండించనీ, చంపనీ.... లాలించనీ.... ఎంత గొప్ప తృప్తి... చెపితే తెలీదు..."

"అని రాణిలాగు శలవు పుచ్చుకుని వెళ్ళారు ఆమె" అన్నారు శాంతాదేవి.

"బాబు గోల చేస్తున్నాడు. భోజనానికి లేద్దాం?" అన్నారు లీల.

"నేను భోజనం చెయ్యను. శలవు."

అని రాణిలాగు శలవు పుచ్చుకుని వెళ్ళారు, మానించి శాంతాదేవిగారు.

◆ ◆ ◆

*రచనాకాలం : **1945** నవంబరు (ఆంధ్రజ్యోతి పత్రిక)*

*ప్రచురణ : (కొత్తచిగుళ్ళు కథల సంపుటి) శ్రీ రమణస్థాన్ పబ్లికేషన్సు, **1962***